క్లుప్తంగా

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే కాసు



గురజాల: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చల్లా కాశీబాబు కలిశారు. పార్టీ పదవి రావడానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మహంకాళీ యశోద దుర్గా, అరికట్ల శ్రీనివాసరెడ్డి, డికే, తదితరులున్నారు.

మంగాపురం సీపీఐ కార్యదర్శిగా గంగాధర్



పిడుగురాళ్ల: మండలంలోని అగ్రహారం గ్రామ పంచాయతీ పరిధిలోని మంగాపురం క్యాంపు సీపీఐ కార్యదర్శిగా రామిరెడ్డి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మంగాపురం క్యాంపులో భారత కమ్యూనిస్టు పార్టీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ హాజరయ్యారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య, షేక్ కరిముల్లా, ఎ.కృష్ణయ్య, సీహెచ్ లక్ష్మీసరిత, శివన్నారాయణ పాల్గొన్నారు.

వరిగడ్డి వాములు దగ్ధం

గురజాల రూరల్: వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని చర్లగుడిపాడులో గ్రామానికి చెందిన వరికల్లు పూర్ణయ్యకు చెందిన ఐదు ఎకరాలకు చెందిన 280 వరి కట్టలు, సంగుల చిన చెన్నయ్యకు చెందిన 15 ఎకరాలకు చెందిన 700 వరికట్టలు ఆదివారం కాలిపోయాయి. రూ.లక్షకు పైగా ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చారు. అప్పటికే పూర్తిగా కాలిపోయింది.

హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరణ



ఆకుల సత్యనారాయణ



బీఎల్ పద్మావతి

గురజాల రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆకుల సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చారు. గురజాలలోని ఇదే పాఠశాలలో 1996, 2000 సంవత్సరంలో పీడీగా విధులు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బీఎల్ పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని హైస్కూల్ నుంచి ప్రమోషన్‌పై గురజాలకు వచ్చారు. వీరిని పలువురు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

బీపీ మండల్ ట్రస్ట్ ఆవిష్కరణ



నెహ్రూనగర్: బీసీల అభ్యున్నతికి సరైన వేదిక ఉండాలనే ఉద్దేశంతో బీపీ మండల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని బీపీ మండల సేన రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నల్లచెరువులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలతో కలసి బీపీ మండల్ ట్రస్ట్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా బీపీ మండల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి రాజధాని ప్రాంతంలో 40 సెంట్ల భూమిని ట్రస్ట్‌కు విరాళంగా ఇస్తామని ప్రకటించిన ఆలా వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ

అనంతరం శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. యాదవ విద్యార్థుల కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ సీఈఓ బి.జ్యోతిబసు మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్ కుమార్



పిడుగురాళ్ల పట్టణంలో వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ మాట్లాడుతూ... కూటమి ఏడాది పాలనలో ఇచ్చిన హామీల అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచింది ఆరోపించారు. అమ్మకు వందనం పేరుతో తల్లులను, ఆడబిడ్డ నిధి అంటూ 18 సంవత్సరాల లోపు నిండిన మహిళలను, యువగళం పేరుతో యువతను, అన్నదాత సుఖీభవ అంటూ రైతులను, ఉచిత బస్ పేరుతో ఆడపడుచులను వెన్నుపోడు పొడిచినట్లు చెప్పారు. గతంలో సుగాలి ప్రీతి అంశంలో ఊగిపోయిన పవన్ కల్యాన్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలం అయినా ఆ కేసును పట్టించుకోవడం లేదంటే అది వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు. సనాతన ధర్మం అంటూ తిరుపతి లడ్డూ విషయంలో పాప ప్రక్షాళన పేరుతో గుడి మెట్లు తుడిచిన పవన్ కల్యాణ్ అదే తిరుపతిలో ప్రభుత్వం నిర్లక్ష్యంతో తొక్కిసలాట జరిగి భక్తులు మృతి చెందితే ఎందుకు పాప ప్రక్షాళన చేయలేదని నిలదీశారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి చింతా వెంకట రామారావు మాట్లాడుతూ... వెన్నుపోటు అనేది చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టి విద్య, తన సొంత మామతో మొదలై ప్రజలకు కూడా అలివి కాని హామీలు ఇచ్చి వెన్నుపోటు పొడిచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... 4వ తేదీ వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవటం దుర్మార్గమని, అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టనున్న వెన్నుపోటు దినానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ధార చెన్నయ్య, కో ఆప్షన్ సభ్యులు జబీర్, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, పట్టణ బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, షేక్ సైదావలి, షేక్ అబ్దుల్లా, కాంద్రగుంట శ్రీను, షేక్ కరిముల్లా, మైనార్టీ నాయకులు షేక్ జానిబాబు పాల్గొన్నారు.



దాచేపల్లిలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి: వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ని ఆదివారం నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ మాట్లాడుతూ... మామని వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారం చేజిక్కించుకున్నారని, 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. మండల కన్వీనర్ కోట కృష్ణ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన 167 హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని, చంద్రబాబు మోసాలతో ప్రజలు రోడ్డు ఎక్కే పరిస్థితులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల జాను, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, పార్టీ సీనియర్ నేతలు కొప్పుల సాంబయ్య, మందపాటి రమేష్‌రెడ్డి, మునగా పున్నారావు, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, షేక్ జాకీర్‌హుస్సేన్, పార్టీ నేతలు షేక్ ఖాదర్‌బాషా, షేక్ దాడీ, కొమ్ము బుజ్జి, నాళం శ్రీనివాసరావు, నంద్యాల వీరారెడ్డి, సైదావలి, జక్కా అశోక్, జంగాల సింగరయ్యయాదవ్, వేముల శ్రీహరి, కందుల జానేసు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల



గురజాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాజకీయాలు ప్రారంభించిన నాటి నుంచి వెన్నుపోటు పొడుస్తూనే వచ్చారన్నారు. ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిడుగురాళ్లలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంవత్సరాల కాలంలో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి అడుగులో కూడా మాయమాటలు చెప్పి నడిచే అలవాటు చంద్రబాబుకు ఉందని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో సంక్షేమం వరద పారిందని వివరించారు. అప్పులు పాలై మన రాష్ట్రం శ్రీలంకలా తయారవుతుందని చెప్పిన చంద్రబాబునాయుడు ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి కన్నా అధికంగా సంక్షేమ పథకాలు ఇస్తామని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందని చెప్పారు. కూటమి నాయకులకు సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలని ప్రజల తరఫున డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గ్రామాల్లో సజీవ సాక్ష్యాలుగా నిలిచిపోయాయన్నారు. వలంటీర్‌లను వెన్నుపోటు పొడిచిన ఘనత, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని వెన్నుపోటు, సిలెండర్‌లు పంపిణీ అని మహిళలను వెన్నుపోటు ఈ విధంగా ప్రతి ఒక్కరిని వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని చెప్పారు.

పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వైద్యశాలలో షేక్ సైదావలిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు, డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించమని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియాలో యాక్టివ్ పనిచేస్తున్న గుత్తికొండ గ్రామానికి చెందిన షేక్ సైదావలిపై టీడీపీ మూకలు ఆదివారం దాడి చేశారు. పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై, నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి వారిని ఇబ్బందులకు గురి చేయడం కూటమి ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని చెప్పారు. ప్రజలు అధికారం ఇచ్చింది అభివృద్ధి చేయమని కానీ ప్రజలను కొట్టమని కాదని అది గుర్తుంచుకొని పట్టణాలు, గ్రామాల అభివృద్ధిపై పోటీ పడాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ హయాంలో మేము చేసిన అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడిందని, అలాగే చేతనైతే మా లాగా అభివృద్ధిలో పోటీపడాలని సూచించారు. ఇటువంటి దాడులు పాల్పడిన వారిని ఉపేక్షించేది ఉండదని, తగిన మూల్యం వారికి అందించే తీరుతామని ఈసందర్భంగా కాసు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రామాంజనేయులు, మస్తాన్‌వలి, అబ్దుల్ ఖాదర్, వాల్ నాయక్, వేగునాయక్, నలబోరు వెంకట్రావు, తోట వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సాంబశివరావు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు



అంకమ్మ తల్లికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో దుద్దుకుంట కుటుంబీకులు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అంకమ్మ తల్లి కొలుపుల్లో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. శ్రీ అంకమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేలకు గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. కొలుపులు సందర్భంగా దుద్దుకుంట కుటుంబీకులు వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేల వెంట మండల కన్వీనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా రైతువిభాంగ అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, రొంపిచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, మద్దూరి భాస్కర్‌రెడ్డి, బీరం భాస్కర్‌రెడ్డి, చాకలికుంట తండా సర్పంచ్ బికారీ నాయక్, దాసరిపల్లి సాంబిరెడ్డి, కాశినేడి మస్తానయ్య, తెలగనేని వెంకటేశ్వర్లు, రాజనాల నాగిరెడ్డి, పాలూరి పేరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయవచ్చు..

రెంటచింతల: చిన్నారులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని బ్రహ్మకుమారీస్ రాజయోగా శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి తెనాలి రామకృష్ణ అన్నారు. స్థానిక ఓం శాంతి భవన్‌లో ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో చిత్ర కళ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, నృత్యం, సంగీతం, యోగ, విలువలు, ఏకగ్రత నియంత్రణపై శిక్షణ తరగతులు నిర్వహించడం వలన వారిలో జ్ఞాపకశక్తిని పెంపొందించవచ్చన్నారు. వివరాలకు 9849885248 సంప్రదించాలని కోరారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్ కుప్పాలసాయి

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం జ్ఞాన మందిరం ప్రాంగణంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో హోమియో వైద్యులు కుప్పాల సాయిజగదీశ్వరి పాల్గొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరానికి హాజరైన రోగులకు వివిధ రకాల జబ్బుల లక్షణాలు, హోమియో వైద్యంతో వాటి శాశ్వత నివారణ చేసుకునే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 100 మందికి పైగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలందించిన డాక్టర్ కుప్పాల సాయి జగదీశ్వరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవా సంఘ్ అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రాచమల్లు సూర్యరావు, కోశాధికారి భవనాశి కోటేశ్వరరావు, చేవూరి కృష్ణమూర్తి, ఆలపాటి కాలేషా, కొత్తూరి కృష్ణకుమార్, కుప్పాల గౌరీశంకర్, బాలనాగు సాంబశివరావు, కొప్పులవూరు రాధాకృష్ణ, మేళ్లచెరువు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెహ్రూనగర్: ఎస్‌వీఎస్‌ఆర్ రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్ నిర్వహించారు. హాస్టల్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, అన్నపురెడ్డి పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి 1977 నుంచి 2024 వరకు చదువుకున్న వారంతా హాజరయ్యారు. హాస్టల్ భవనం నిర్మించి 50 సంవత్సరాలై శిథిలావస్థకు చేరుకోవడంతో హాస్టల్ పునఃనిర్మాణానికి రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో సెక్రటరీ కంది సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ భవనం వెంకటరెడ్డి, కోశాధికారి వనుకూరి సాంబిరెడ్డి, రెడ్డి జన సేవా సమితి అధ్యక్షులు వీసీఆర్ రెడ్డి, ఉపాధ్యక్షులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, శ్యామల కోటిరెడ్డి, ట్రెజరర్ జంగా సీతారామిరెడ్డి, సోమసాని బ్రహ్మానందరెడ్డి, వనుకూరి సాంబిరెడ్డి, ఎం భాస్కర్‌రెడ్డి, జీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయ కళల్లో ఉచిత శిక్షణ అభినందనీయం

నగరంపాలెం: సంప్రదాయ కళల్లో నెలరోజులు ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని ప్రముఖ నాట్యాచారులు కాజా సుబ్రహ్మణ్యం అన్నారు. సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్రంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సద్గురు కళానిలయం నిర్వహణలో జరగ్గా, నంది అవార్డు గ్రహీత బసవరాజు జయశంకర్ సభాధ్యక్షత వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ రాఘవాచారి వేదస్వస్తి ప్రార్థనతో ప్రారంభించారు. అనంతరం కాజా సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణరవిబాబు, నడింపల్లి హనుమంతరావు, శిక్షణాచార్యులు బసవరాజు జయశంకర్, పీవీ లక్ష్మీతేజస్వి, వైఆర్ సుబ్రహ్మణ్యం, కిన్నెర, బి.రామకృష్ణారావు, పి.హేమలతనారాయణ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి సర్వర్ కష్టాలు

- తొలిరోజే గంటల తరబడి నిరీక్షణ
- ఆందోళనలో కార్డు దారులు



రేషన్ దుకాణంలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



గురజాలలో రేషన్ దుకాణం వద్ద వేచివున్న కార్డుదారులు

గురజాల: రేషన్ పంపిణీలో ప్రభుత్వం మార్పులు తెచ్చింది. ఇంటింటికి పంపిణీని నిలిపివేసి రేషన్ దుకాణాల వద్ద పంపిణీనికి ఆదివారం శ్రీకారం చుట్టారు. అయితే తొలి రోజే లబ్ధిదారులకు కష్టాలు తప్పలేదు. సర్వర్లు మొరాయించాయి. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి కనిపించింది.

నియోజకవర్గంలో ఇలా..

గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. సుమారుగా గురజాలలో 38, దాచేపల్లిలో 42, మాచవరంలో 38,పిడుగురాళ్ల 79 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదే విధంగా గురజాలలో 21,396, దాచేపల్లిలో 22,689, మాచవరంలో 16,271, పిడుగురాళ్లలో 44,020 రేషన్ కార్డుదారులున్నారు.ఇంటింటికి తిరిగి రేషన్ పంపిణీ చేసేందుకు గాను గత ప్రభుత్వం హయాంలో గురజాలలో 14, దాచేపల్లిలో 15, మాచవరంలో 11, పిడుగురాళ్లలో 24 ఎండీయూ వాహనాలు ఏర్పాటుచేసి ఇంటింటికి రేషన్ అందించారు. దీంతో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రతి ఒక్కరికి సరుకులు అందాయి. కానీ నేడు ఆ విధానాన్ని తొలగించి రేషన్ డిపోల వద్దకు వెళ్లి తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు.

పిడుగురాళ్లలో రేషన్ పంపిణీ..

పిడుగురాళ్ల: పట్టణంలోని 20వ వార్డులోని రేషన్ దుకాణంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వి.మురళి, తహసీల్దార్ మధుబాబు, కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పాల్గొన్నారు.

రేషన్‌ను సకాలంలో పంపిణీ చేయాలి

మాచర్ల రూరల్: రేషన్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా సమయపాలన పాటించి ప్రతి ఒక్క కార్డుదారుడికి సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రేషన్ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో జి.రమణ, ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్ఓ ఖాజావలి పాల్గొన్నారు.

ఇబ్బందులు పడాలి



గతంలో ఇంటి వద్దకు వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. నూతన విధానం వలన గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. సుమారుగా గంటకు పైగా సర్వర్ రాకపోవడంతో కూర్చోవాల్సి వచ్చింది. ఈ విధానం వలన వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడాల్సివస్తుంది. సర్వర్ సరిగ్గా వుండేలా చూస్తే ఈ ఇబ్బందులు లేకుండా పోతాయి. వృద్ధులు, వికలాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– పాపిరెడ్డి, గురజాల

ఏఎస్ఐ అనంతలక్ష్మి మృతికి నివాళి



నగరంపాలెం: మహిళా పోలీస్‌స్టేషన్ (పీఎస్) ఏఎస్ఐ ఎల్.అనంతలక్ష్మి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఆమె మృతికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ విభాగం నుంచి లక్ష రూపాయలను ఆదివారం ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు మహిళా పీఎస్ సీఐలు కృష్ణయ్య, నారాయణ, జిల్లా ఇన్‌చార్జి వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, పోలీస్ అసోసియేషన్ సభ్యులు అందించారు. పోలీస్ శాఖ గౌరవ వందనం, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రైటర్ యోహాను, జిల్లా పోలీస్ అసోసియేషన్ ఉపాధ్య క్షుడు మైలా సాంబశివరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బేబీ రాణి, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి ఎండీ.హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కరిముల్లా పాల్గొన్నారు.

వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే సరుకులు

రెంటచింతల: మండలంలోని వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే నిత్యావసరాలు అందజేయనున్నట్లు తహసీల్దార్ దొప్పటపూడి మేరికనకం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని రేషన్ షాపుల వద్ద నుంచి రైస్ కార్డు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, వీఆర్వోలు నాసరయ్య, రేఖ, విఘ్నేష్, నాసర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ బి.రామకృష్ణ, నాయకులు మూలి రాజారెడ్డి, మర్రి కుమార్, ఒ.ఇన్నారెడ్డి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న తరుణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ద్వారా అవి త్వరితగతిన ఎదిగే అవకాశం ఉంటుందని, దానిలో భాగంగా అబ్బూరు, ఫణిధం, నందిగం గ్రామాల్లో సచివాలయాలు, ముఖ్య ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అబ్బూరు గ్రామంలో ఓలేటి కుమారి, మర్రి శ్రీనివాసరావు, పులనాల బ్రహ్మయ్య, రుద్రపోగు కృష్ణ, చింతపల్లి గురవయ్య, ఫణిధంలో ఓలేటి గురవయ్య, బక్క జోజి, నందిగంలో తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి బక్క సుబ్బారావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు

దాచేపల్లి: ఎయిడ్స్ బాధితులపై సమాజంలో వివక్ష చూపించవద్దని రీడ్స్ సంస్థ పీడీ ఎండీ గౌస్ అన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణపై దాచేపల్లిలోని లైబ్రరీ సెంటర్‌లో ఆదివారం సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఆయుర్వేదంపై జాతీయ సెమినార్

గుంటూరు మెడికల్: ఆయుర్వేద వైద్యులకు నేషనల్ లెవెల్ సెమినార్, శిక్షణ కార్యక్రమం స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల పొత్తూరులో విశ్వాయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్, చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ కేఎస్ఎన్ గోపాలన్ తెలిపారు. ఆదివారం స్థానిక సాలిపేటలోని స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డాక్టర్ గోపాలన్ మాట్లాడుతూ సోమవారం నుంచి 6వ తేదీ వరకు అనేక అంశాలపై వైద్యులకు, ఆయుర్వేద వైద్య విద్యార్థులకు శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ జరుగుతుందని చెప్పారు. ఆయుర్వేద చికిత్సలపై శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు వెల్లడించారు.